సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



ఊరూరా వనదేవతలు..
రెండేళ్లకోసారి వనదేవతల జాతర ఊరూరా జరుగుతుండగా.. ఆయా ప్రాంగణాల్లో భక్తులకు సరైన సౌకర్యాలు ఉండడం లేదు.
8లో



సక్రమంగా వినియోగించాలి
ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం నిధులను సక్రమంగా వినియోగించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు.
8లో



వాతావరణం
జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు గంటగంటకూ పెరుగుతాయి. అయితే రాత్రి వేళ మాత్రం చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు


సామూహిక అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్ : వసంత పంచమిని పురస్కరించుకుని మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయంలో సరస్వతీ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులతో పాటు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, పాలకమండలి అధ్యక్షుడు మహిపతి రామలింగం తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న డీఎస్పీ

పాల్వంచ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన లింగబోయిన ఆదినారాయణ బుధవారం పెద్దమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు.

6వ బెటాలియన్‌లో చిల్డ్రన్స్ పార్క్ ప్రారంభం


మొక్కకు నీళ్లు పోస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండలో గల 6వ బెటాలియన్‌లో నిర్మించిన చిల్డ్రన్స్ పార్క్‌ను అదనపు డీజీపీ స్వాతి లక్రా వర్చువల్‌గా బుధవారం ప్రారంభించారు. దీంతో పాటు 5 కి.మీ. ట్రాక్‌ను, మూడు బ్యారెక్‌లను ఎస్పీ రోహిత్‌రాజ్, బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ ఎ. అంజయ్య, ఏఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్లలో నాణ్యత లోపిస్తే చర్య తప్పదు
జిల్లా సంక్షేమాధికారి విజేత


కోడిగుడ్లను పరిశీలిస్తున్న విజేత

పాల్వంచ : అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్లు, ఇతర సరుకుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని జిల్లా సంక్షేమాధికారి వేల్పుల విజేత హెచ్చరించారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని గుడిపాడు అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, సరుకు నిల్వలను పరిశీలించారు. నాణ్యత లేని సరుకులు సరఫరా చేస్తే పిల్లలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. సిబ్బంది విధుల్లో అలసత్వం వహించొద్దని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు పక్కాగా నిర్వహించాలి

ములకలపల్లి : పంటల నమోదు ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి కె.అభిమన్యుడు ఆ శాఖ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. జగన్నాథపురం పంచాయతీ పరిధిలోని చింతపేటలో సాగు చేస్తున్న పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూసార పరీక్షలు నిర్వహించాలని అన్నారు. భూములకు అనువైన పంటలను సాగు చేయడం ద్వారా అధిక దిగుబడిని సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ వ్యవసాయ అధికారి సాయినారాయణ, ఎంఏఓ కరుణామయి, ఏఈఓ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతర వేళ బెల్లం అమ్మకాల్లో గోల్‌మాల్

- బంగారానికి భారీగా పెరిగిన డిమాండ్
- రోజుకో రకంగా ధర నిర్ణయిస్తున్న వ్యాపారులు
- తూనికలు, కొలతలు, నాణ్యతపై కొరవడిన పర్యవేక్షణ

నిఘా బంగారమాయె..

ఇల్లెందులో ఓ దుకాణం ఎదుట విక్రయానికి సిద్ధంగా ఉంచిన బెల్లం


వనదేవతలైన సమ్మక్క – సారలమ్మలకు తెలంగాణ, ఏపీతో పాటు పొరుగు రాష్ట్రాల్లోనూ లక్షలాదిగా భక్తులు ఉన్నారు. రెండేళ్లకోసారి మేడారంలో జరిగే జాతర సందర్భంగా లక్షల మంది భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. ఈ క్రమంలో అమ్మవార్లకు ఇష్టమైన ఎత్తు బంగారం (బెల్లం) ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. జాతర సందర్భంగా భారీ స్థాయిలో బెల్లం విక్రయాలు జరుగుతాయి. అయితే బెల్లం క్రయవిక్రయాలపై ప్రభుత్వ నిఘా కొరవడడంతో భక్తుల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

పర్యవేక్షణ కరువు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మహారాష్ట్రలోని పూర్ణ, ఏపీలోని తాడేపల్లిగూడెం, అనకాపల్లి నుంచి బెల్లం దిగుమతి అవుతుంది. ఇందులో ముదురు బ్రౌన్ రంగులో ఉన్న బెల్లం ఎక్కువ క్వాలిటీది కాగా, లేత బ్రౌన్, తెలుపు రంగుకు దగ్గరగా ఉండే బెల్లం తక్కువ క్వాలిటీదిగా ఉంటుంది. ఇందులో ముదురు బ్రౌన్ రంగు బెల్లం ధర ఎక్కువగా, మిగిలిన రకాల సరుకు ధరలు తక్కువగా ఉంటాయి. ఇక మేడారం జాతర నేపథ్యంలో గత రెండు నెలలుగా జిల్లా వ్యాప్తంగా బెల్లం అమ్మకాలు జోరందుకున్నాయి. కానీ వీటిపై ప్రభుత్వ విభాగాల పర్యవేక్షణ కరువైంది. ఫలితంగా ఎక్కువ ధర చెల్లించి తక్కువ నాణ్యత గల బెల్లం తీసుకుంటూ భక్తులు నష్టపోతున్నారు.

ఎక్సైజ్ శాఖ మాత్రమే నజర్..

పదేళ్ల క్రితం వరకు జిల్లాలో నాటుసారా తయారీ విరివిగా ఉండేది. ఇందులో బెల్లాన్ని భారీగా వినియోగించేవారు. దీంతో బెల్లం అమ్మకాలపై ఎక్సైజ్ శాఖ నిఘా ఉండేది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత నాటుసారా తయారీపై ఉక్కుపాదం మోపారు. దీంతో జిల్లాలో 99.9 శాతం మేర స్థానికంగా సారా తయారీ ఆగిపోయింది. అక్కడక్కడా గుట్టుచప్పుడు కాకుండా కొందరు మాత్రమే నాటుసారా కాస్తున్నారు. అయినప్పటికీ బెల్లం అమ్మకాలపై ఎక్సైజ్ శాఖ నజర్ పెట్టింది. అమ్మకాలకు లైసెన్సుల జారీ మొదలు వినియోగదారుల ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ వరకు ఎప్పటికప్పుడు నిఘా ఉంచింది. ఇక తూనికలు కొలతలు, వాణిజ్య పనుల శాఖ అధికారులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు.


బాలుడి ఎత్తుబంగారం తూకం వేస్తున్న దృశ్యం

బిల్లుల జాడే లేదు..

మేడారం జాతర సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రూ. నాలుగు నుంచి రూ.ఐదు కోట్ల విలువైన బెల్లం విక్రయాలు జరుగుతాయని అంచనా. భక్తులు బెల్లం దుకాణాల దగ్గరికి వెళ్లి త్రాసులో తమ ఎత్తు బంగారం తూకం వేయించి అందుకు తగ్గ నగదు చెల్లిస్తారు. కానీ కొనుగోలు మొత్తానికి ఎక్కడా బిల్లులు ఇస్తున్న దాఖలాలు లేవు. గూడ్స్, సర్వీస్ ట్యాక్స్ (జీఎస్టీ)లో బెల్లానికి 5 శాతం మేర ట్యాక్స్ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. కానీ లెక్కల్లోకి రాకుండా ఎక్కువ బెల్లం మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ మేరకు సర్కారు ఆదాయానికి సైతం గండి పడుతోంది. ఇప్పుడైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి బెల్లం నాణ్యత, తూకం వంటి విషయాలపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

వ్యాపారుల ఇష్టారాజ్యం..

ప్రస్తుతం మార్కెట్‌లో విక్రయిస్తున్న బెల్లం ఏ గ్రేడుకు చెందిందనేది ఎవరికీ అంతుపట్టని విషయంగా మారింది. తక్కువ గ్రేడ్ బెల్లాన్ని ఎక్కువ గ్రేడ్ ధరకు అమ్మినా పట్టించుకునే వారు లేరు. భక్తులకు ప్రసాదంగా అందించే బెల్లం నాణ్యతను పరిశీలించడంపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇక బెల్లం ఒక కేజీ, బాక్సు, పది కేజీల ముద్దలుగా అమ్ముతున్నారు. దుకాణాల ముందే పెద్ద త్రాసులు ఏర్పాటు చేసి ఎత్తు బెల్లాన్ని జోకుతున్నారు. అయితే ఈ తూకాల్లో మోసాలు జరుగుతున్నా ప్రశ్నించే వారే లేకుండా పోయారు. అంతే కాదు వ్యాపారులు రోజుకో రకంగా బెల్లం ధరలు నిర్ణయిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో సగటున కేజీ బెల్లం ధర రూ.50కి పైగా ఉండగా, పది కేజీల బెల్లం ముద్ద ధర రూ.450 చొప్పున అమ్ముతున్నారు. ఇలా ధరల మధ్య ఉన్న వ్యత్యాసంలో హేతుబద్ధత ఎంత అనేది ప్రశ్నార్థకంగా మారింది. వారం క్రితం పది కేజీల బెల్లం ముద్ద కిలోకు రూ.50 చొప్పున అమ్మగా.. జాతర సమీపిస్తున్న తరుణంలో కేజీకి రూ. 5 తగ్గించి అమ్మడంలో మర్మమేంటనేది అంతు చిక్కడం లేదు.

వైభవంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుక బుధవారం వైభవంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అలరించిన రామదాసు కీర్తనలు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భక్త రామదాసు జయంత్యుత్సవాల్లో భాగంగా బుధవారం సంగీత కళాకారులు ఆలపించిన కీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన షణ్ముఖ శర్మ వయోలిన్, శ్యామల వెంపటి బృందం, త్రిష, ఇషా బృందం, క్రిష్ణమోహన్, శ్రీలక్ష్మి, కపిలవాయి లలిత, మల్లాది నాగలక్ష్మి, సింధు రాగేశ్వరి తదితరులు రామదాసు కీర్తనలు ఆలపించారు. ఖమ్మానికి చెందిన సయ్యద్ దర్గా సైదులు బృందం, హైదరాబాద్‌కు చెందిన చంద్రశేఖర్, జొన్నలగడ్డ శ్రీరామ్ బృందం వారి శాస్త్రీయ సంగీతం ఆకట్టుకుంది. కాగా, రామదాసు జయంతి ప్రయుక్త వాగ్గేయకారోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి.

ఈవీఎం గోడౌన్ పరిశీలించిన కలెక్టర్

నవభారత్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ ప్రియాంక ఆల బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ల పరిశీలన అత్యంత ప్రధానమని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం జిల్లాకు మొదటి దశలో 1,588 బ్యాలెట్ యూనిట్లు, 1,424 కంట్రోల్ యూనిట్లు, 1,683 వీవీ ప్యాట్లను కేటాయించిందని, పరిశీలన అనంతరం వీటిని గోడౌన్లలో భద్రపరుస్తామని చెప్పారు. ఈసీఐఎల్‌కు చెందిన సాంకేతిక నిపుణులు కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్ రంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఈవీఎం గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

డీఎస్పీల బదిలీలు నిలిపివేత

కొత్తగూడెంటౌన్/పాల్వంచ/ఇల్లెందు : జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు డీఎస్పీలను బదిలీ చేస్తూ ఈనెల 12న ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం.. తిరిగి బుధవారం రద్దు చేసింది. అయితే ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తిని తొలుత కొత్తగూడెం డీఎస్పీగా బదిలీ చేయగా.. మారిన ఉత్తర్వుల మేరకు ఆయన ఖమ్మం ఏసీపీగా నియమితులయ్యారు. ఇక కొత్తగూడెం, పాల్వంచ డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, వెంకటేష్‌ను యథాతథంగా కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అబ్దుల్ రెహమాన్‌ను మామునూరు(వరంగల్) ఏసీపీగా, కొత్తగూడెం సీసీఎస్‌లో ఉన్న ఆదినారాయణను పాల్వంచ డీఎస్పీగా బదిలీ చేశారు. పాల్వంచకు వచ్చిన ఆదినారాయణ బుధవారం పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు సైతం చేసి బాధ్యతలు స్వీకరించారు. అయితే రాత్రికి మళ్లీ ఉత్తర్వులు రావడంతో తిరిగి సీసీఎస్ విభాగంలోకి వెళ్లినట్లు తెలిసింది. ఇక మణుగూరు డీఎస్పీగా జగిత్యాల జిల్లా మెట్‌పల్లి నుంచి వంగా రవీందర్ వస్తున్నారు. ఇల్లెందు డీఎస్పీగా ఎన్. చంద్రభాను నియామకం అయ్యారు. ప్రస్తుతం ఆయన రైల్వే విభాగంలో రోడ్ సేఫ్టీ డీఎస్పీగా కొనసాగుతున్నారు. శుక్రవారం ఇల్లెందులో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

ఫలించని సంధి చర్చలు

- కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- క్యాంప్‌లో మరో వర్గం సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస బలపరీక్షకు గడువు సమీపిస్తున్న కొద్దీ రాజకీయం వేడెక్కుతోంది. రెండు వర్గాలుగా విడిపోయిన కౌన్సిలర్లను ఒకటి చేసేందుకు బీఆర్ఎస్ కీలక నేతలు జరిపిన సంధి చర్చలు విఫలమయ్యాయి. అవిశ్వాసంలో నెగ్గేలా ఒక వర్గం, వీడేలా మరో వర్గం వ్యూహ, ప్రతి వ్యూహాలతో ముందుకు వెళ్తున్నాయి. చైర్‌పర్సన్ వర్గం వారు మంగళవారమే వైజాగ్ క్యాంపునకు వెళ్లారనే ప్రచారం జరుగుతోంది. ఇక అవిశ్వాస నోటీస్ కలెక్టర్‌కు అందజేయడంలో కీలకంగా వ్యవహరించిన భీమా శ్రీవల్లి అనుచర కౌన్సిలర్లు వర్గంలోని కొందరు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మున్సిపాలిటీలో మొత్తం 36 మంది కౌన్సిలర్లు ఉండగా అవిశ్వాస బలపరీక్షలో విజయం సాధించాలంటే 24 మంది సభ్యుల మద్దతు ఉండాలి. దీంతో ఇరు వర్గాల వారు తమ బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈనెల 19న బలపరీక్ష ఉండగా కొత్తగూడెం మున్సిపాలిటీల్లో వేగంగా మార్పులు జరుగుతున్నాయి. ఇరు వర్గాల వారిని కలిపేందుకు బీఆర్ఎస్ కీలక నేత జరిపిన మంతనాలు బెడిసి కొట్టడంతో రెండు వర్గాల వారు చెరో దారి వెదుక్కున్నారు. 22 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసినప్పటికీ.. అందులో చాలామంది తనతో టచ్‌లో ఉన్నారని చైర్‌పర్సన్ మొదటి నుంచీ ధీమా వ్యక్తం చేస్తున్నారు. రెండో వర్గం వారు సైతం తమకు సరిపడా బలం ఉందని అంటున్నారు. ఈ క్రమంలో బలపరీక్షలో ఎవరు నెగ్గుతారోనని పట్టణ ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక కలిసొచ్చేనా..?

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టిన భీమా శ్రీవల్లి వర్గం వారు కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తే భవిష్యత్‌లో కూడా బాగుంటుందనే వ్యూహంతో పార్టీ కండువాలు కప్పుకున్నారనే చర్చ జరుగుతోంది. స్థానిక ఎమ్మెల్యే కూడా తమకే మద్దతు పలుకుతారనే నమ్మకం కాంగ్రెస్‌లో చేరిన వారిలో వ్యక్తమవుతోంది. అయితే ప్రత్యర్థి వర్గం అంచనాలు నిజమైతే అవిశ్వాస తీర్మానం నెగ్గే అవకాశం ఉంటుంది. ఏదైనా తారుమారైతే చైర్‌పర్సన్‌కు కలిసొస్తుందని పరిశీలకులు అంటున్నారు. ప్రస్తుత పాలకవర్గంలో 36 మంది కౌన్సిలర్లలో ఇద్దరు ఇండిపెండెంట్లు, ముగ్గురు సీపీఐ, ఒక కాంగ్రెస్ కౌన్సిలర్ పోగా మిగిలిన వారంతా బీఆర్ఎస్ నుంచి ఎన్నికైనవారే. అయితే తాజాగా ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ఎనిమిది మంది కౌన్సిలర్ల భర్తలు కాంగ్రెస్‌లో చేరారు. అయినా ప్రస్తుతానికైతే కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్‌కే బలం ఎక్కువగా ఉంది. మరి 19వ తేదీ నాటికి పరిస్థితులు ఎలా ఉంటాయో చూడాల్సిందే.

ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్

పాఠశాలలకు సెలవులు ప్రకటించిన హెచ్‌ఎంలు

ఇల్లెందు: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వొద్దని ఉన్నతాధికారులు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇల్లెందులోని రెండు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వాటిని బేఖాతర్ చేశారు. వసంతపంచమిని పురస్కరించుకుని బుధవారం పాఠశాలలకు ఆప్షనల్ హాలిడే ప్రకటించారు. అంతటితో ఆగకుండా తమకు లేని అధికారాన్ని సైతం వాడుకుని స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలకు కూడా సెలవులు ఇచ్చారు. తమ అనుమతి లేకుండా ఎలాంటి సెలవులు మంజూరు చేయొద్దని వారం రోజుల క్రితం కలెక్టర్ ప్రియాంక ఆల, రెండు రోజుల క్రితం డీఈఓ వెంకటేశ్వరాచారి ఆదేశాలు జారీ చేశారు. కాగా, ఇల్లెందు జేబీఎస్, సుభాష్‌నగర్ హైస్కూల్ హెచ్‌ఎంలు బుధవారం తమ పాఠశాలలతో పాటు కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలకు కూడా సెలవు ఇచ్చారు. ప్రాథమిక పాఠశాలలకు ఎంఈఓ మినహా ఇతరులకు సెలవు ఇచ్చే అధికారం లేదు. ఆప్షనల్ హాలీడేలను సైతం మండలంలోని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో చర్చించిన తర్వాతే ప్రకటిస్తారు. కాగా, సదరు హెచ్‌ఎంల వ్యవహార శైలిని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై జేబీఎస్ హెచ్‌ఎం పీసీ శర్మను వివరణ కోరగా డీఈఓ, ఎంఈఓల నుంచి ఆదేశాలు రాకముందే తాను ఆప్షనల్ హాలీడే ప్రకటించినట్లు తెలిపారు. డీఈఓ వెంకటేశ్వరాచారిని వివరణ కోరగా ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వొద్దని ప్రకటించినప్పటికీ ఆప్షనల్ హాలీడే ఇచ్చినట్లు తెలిసిందని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

పెద్దలు ఇద్దరు మనోళ్లే..

- రాజ్యసభకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్, బీఆర్ఎస్
- కాంగ్రెస్‌లో ఒక స్థానం రేణుకాచౌదరికి..
- బీఆర్ఎస్ ఏకైక అభ్యర్థిగా వద్దిరాజు రవిచంద్ర

సాక్షిప్రతినిధి, ఖమ్మం: తెలంగాణ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న వద్దిరాజు రవిచంద్ర, బి.లింగయ్యయాదవ్, జోగినపల్లి సంతోష్‌కుమార్ పదవీ కాలం ఏప్రిల్‌లో ముగియనుంది. దీంతో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా నామినేషన్ల స్వీకరణకు గురువారం వరకు అవకాశముంది. ఈనేపథ్యాన అసెంబ్లీలో బలాబలాలను పరిశీలిస్తే కాంగ్రెస్‌కు రెండు సీట్లు, బీఆర్ఎస్‌కు ఒకటి దక్కనుంది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థుల్లో కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరికి చోటుదక్కింది. అలాగే, బీఆర్ఎస్ తమ అభ్యర్థిగా ఇప్పటికే ఎంపీగా ఉన్న వద్దిరాజు రవిచంద్రను ప్రకటించింది. ఖమ్మం జిల్లా నుంచి ఇద్దరు నేతలకు అవకాశం దక్కడంపై శ్రేణులు సంబురాలు జరుపుకున్నాయి.

మూడు స్థానాల ఖాళీతో..

తెలంగాణలో ఏడు రాజ్యసభ స్థానాలు ఉండగా, ఇవన్నీ బీఆర్ఎస్ చేతిలోనే ఉన్నాయి. అయితే ఆ పార్టీకి చెందిన ముగ్గురి పదవీకాలం ఏప్రిల్‌తో ముగుస్తోంది. ఈ నేపథ్యాన ఎన్నికలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగా, ఆ పార్టీకి అసెంబ్లీలో 64 మంది ఎమ్మెల్యేలు, మిత్రపక్షమైన సీపీఐ ఎమ్మెల్యే కలిపి 65 మంది ఉన్నారు. సంఖ్యాబలం ఆధారంగా కాంగ్రెస్ పార్టీ రెండు రాజ్యసభ స్థానాలు గెలుచుకోనుంది. ఇక బీఆర్ఎస్‌కు ఎమ్మెల్యేల సంఖ్య ఆధారంగా ఆ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన వద్దిరాజు రవిచంద్ర గెలుపు కూడా లాంఛనమే కానుంది.

రాజ్యసభకు రేణుక..



కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి మరోసారి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించనున్నారు. తెలంగాణ నుంచి రాజ్యసభకు పోటీ చేసే అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేయగా, ఇందులో ఎం.అనిల్‌కుమార్‌యాదవ్‌తో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన రేణుకాచౌదరి ఉన్నారు. నామినేషన్ వేసేందుకు గురువారం చివరి తేదీ కావడంతో ఆమె ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాంగ్రెస్‌కు ఉన్న ఎమ్మెల్యేల బలంతో ఆమె రాజ్యసభకు ఎన్నిక కావడం ఖాయమైనట్లే. ఇప్పటి వరకు మూడుసార్లు రాజ్యసభకు, రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికైన రేణుక.. నాలుగోసారి రాజ్యసభకు వెళ్లనున్నారు.

ఖమ్మం నుంచి రెండుసార్లు..

రేణుకా చౌదరి ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి 1999, 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. అయితే, 2009లో టీడీపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావుపై, 2019లో బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు చేతిలో ఓడిపోయారు. కాగా, టీడీపీలో ఉండగా రేణుకాచౌదరి 1997 – 98లో హెచ్‌డీ దేవెగౌడ కేబినెట్‌లో ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 1998లో కాంగ్రెస్‌లో చేరారు. 2004 నుంచి 2009 వరకు కేంద్రమంత్రిగా కొనసాగిన ఆమె ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ కమిటీలో 1999 నుంచి 2000 వరకు, 2012 నుంచి 2014 వరకు ఫైనాన్స్ కమిటీలో, 2021 నుంచి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ సొసైటీలో సభ్యురాలిగా వ్యవహరించగా, 2012లో రాజ్యసభ వైస్‌చైర్మన్ పానెల్‌లో నామినేట్ అయ్యారు. 2013 నుంచి 2016 వరకు బిజినెస్ అడ్వైజరీ, హౌస్, వ్యవసాయ, జనరల్ పర్పస్ కమిటీలో మెంబర్‌గా, 2016లో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్ కమిటీకి చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు.

అనూహ్యంగా రాజ్యసభకు..

రేణుకా చౌదరి త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం నుంచి బరిలో నిలిచేందుకు ఆసక్తి కనబరిచారు. గతంలో రెండుసార్లు గెలుపొందగా.. రెండుసార్లు ఓటమి చవిచూశారు. అయితే ఈసారి మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే ఉద్దేశంతో టికెట్ కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. స్థానికంగానూ నేతలకు టచ్‌లో ఉంటూ ఢిల్లీ స్థాయిలో తనకున్న పరిచయాలతో టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఇంతలోనే ఆమెను అనూహ్యంగా రాజ్యసభ అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించడం విశేషం. రేణుకాచౌదరి 1986, 1992లో టీడీపీ హయాంలో, 2012లో కాంగ్రెస్ హయాంలో రాజ్య సభ సభ్యురాలిగా పనిచేశారు. ఇప్పుడు ఎన్నికైతే నాలుగోసారి రాజ్యసభలో అడుగు పెట్టనున్నారు. కాగా, రేణుకాచౌదరిని రాజ్యసభకు ఎంపిక చేసిన నేపథ్యాన ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎవరు పోటీ చేయనున్నారనే చర్చ మొదలైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి, కాంగ్రెస్ నేత వీహెచ్, వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు దరఖాస్తు చేసుకోగా, టికెట్ ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

వద్దిరాజుకు మళ్లీ చాన్స్



గాయత్రి గ్రానైట్స్ అధినేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు మరోసారి రాజ్యసభ యోగం పట్టనుంది. ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఆధారంగా బీఆర్ఎస్‌కు ఒక రాజ్యసభ సీటు దక్కే అవకాశం ఉంది. ఆ సీటును వద్దిరాజుకు కేటాయిస్తూ పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్‌కు 39 మంది ఎమ్మెల్యేలు ఉండగా.. ఒక రాజ్యసభ స్థానం గెలుపొందాలంటే 31 మంది మద్దతు అవసరమవుతుంది.

బీఆర్ఎస్‌కు ఒకటి..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, ప్రస్తుత ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని పరిశీలిస్తే కాంగ్రెస్ నుంచి రాజ్యసభకు రెండు, బీఆర్ఎస్‌కు ఒక స్థానం దక్కనున్నాయి. రవిచంద్రతోపాటు జోగినపల్లి సంతోష్‌కుమార్, బడుగు లింగయ్యయాదవ్ పదవీకాలం కూడా ఏప్రిల్‌తో పూర్తవుతుంది. అయితే మరోసారి వద్దిరాజుకు అవకాశం ఇస్తామన్న హామీ మేరకు కేసీఆర్ ఆయన పేరు ఖరారు చేశారు. గురువారం ఆయన నామినేషన్ దాఖలు చేయనుండగా, వద్దిరాజు అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తల్లో హర్షం వ్యక్తమవుతోంది.

సమస్యలపై స్పందించి..

బీఆర్ఎస్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఉన్న బండా ప్రకాష్ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో ఆ స్థానంలో వద్దిరాజు రవిచంద్రను కేసీఆర్ బరిలో నిలబెట్టారు. అప్పట్లో బీఆర్ఎస్‌కు ఉన్న సంఖ్యాబలంతో ఆయన రాజ్యసభకు 2022 మే నెలలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఇరవై నెలల కాలంలో ఆయన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీపరంగా తనదైన ముద్ర వేశారు. మున్నూరుకాపు సామాజిక వర్గంలో రాష్ట్రంలో ముఖ్యనేతగా ఉన్న వద్దిరాజు బీఆర్ఎస్‌లోకి ఆ సామాజిక వర్గం నేతలను చేర్పించడంలో ముఖ్యపాత్ర పోషించారు. అసెంబ్లీ ఎన్నికల సమయాన ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గ బాధ్యతలు నిర్వర్తించారు. ఇక పార్లమెంట్‌లో ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణకు సంబంధించిన పలు సమస్యలను ప్రస్తావించారు.

క్లుప్తంగా

నేడు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

టేకులపల్లి: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కోయగూడెం ఓపెన్ కాస్టు పిట్–1కు సంబంధించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు కేటీసీ పీఓ కార్యాలయ సమీపంలో నిర్వహించనున్నారు. ఇప్పటికే పిట్–1కు రెండు మిలియన్ టన్నుల బొగ్గు వెలికి తీతకు అనుమతి ఉండగా, మరో మిలియన్ టన్నుల బొగ్గు తీయాలంటే పర్యావరణ అనుమతి తప్పనిసరి. ఈ నేపథ్యంలోనే ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. ఈ సమావేశానికి కలెక్టర్ ప్రియాంక ఆల హాజరు కానున్నారు.

వాటర్ ట్యాంక్ శుభ్రం


ట్యాంకును శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకును బుధవారం పంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు. పంచాయతీ పరిధిలోని వాటర్‌ట్యాంకు నుంచి సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీటిలో అవుడు రావడంపై బుధవారం 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన పంచాయతీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. వాటర్ ట్యాంకులోని నీటిని పూర్తిగా విడిచిపెట్టి ట్యాంకును పూర్తిగా శుభ్రం చేశారు.

ముగిసిన రామదాసు జయంత్యుత్సవాలు


సంగీత కచేరీలో కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

నేలకొండపల్లి: పరమ భక్తాగ్రేసరుడు, కంచర్ల గోపన్న(భక్త రామదాసు) స్వస్థలమైన నేలకొండపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న జయంత్యుత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు కొటూరి గాయత్రి శశిశ్రీ, లలితమ్మ, వికాస తరంగిణి బాధ్యులు సంగీత విభావరి నిర్వహించారు. అలాగే, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు రామదాసు కీర్తనలు ఆలపించారు. అనంతరం జాతీయ స్థాయి అవార్డు పొందిన కవి చిలకబత్తిని వీరబాబును భక్తరామదాసు విద్వత్ కళాపీఠం ఆధ్వర్యాన సన్మానించారు. ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి పాల్గొని మందిరంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, షర్ఫొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీనగర్ కాలనీలో బుధవారం ఉదయం మహిళ మెడలో నుంచి దుండగుడు గొలుసు లాక్కెళ్లాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీలోని ఐదో నంబర్ లైన్‌లో ఉంటున్న శారద ఉదయం ఆరు గంటల సమయంలో ఇంటి ముందు వాకిలి శుభ్రం చేస్తోంది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మూడు తులాల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. బాధితురాలు లక్ష్మీదేవిపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

వివాహిత ఆత్మహత్య

ఇల్లెందు/ఇల్లెందురూరల్: మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీ వేములవాడ గ్రామానికి చెందిన మూతి ఊర్మిల(38) బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కొంత ఆలస్యంగా ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు గమనించి ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మహబూబాబాద్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఊర్మిల మృతిచెందింది. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దుమ్ముగూడెం: ఈ నెల 11న దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల క్రాస్‌రోడ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బావరాజు నాగేంద్ర (48) భద్రాచలంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కేశవరావు బుధవారం తెలిపారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,595

ఊరూరా వనదేవతలు.. సౌకర్యాలకు భక్తుల వేడుకోలు



జిల్లావ్యాప్తంగా సుమారు 400 గ్రామాల్లో గద్దెలు

- మేడారంలాగే రెండేళ్లకోసారి సమ్మక్క–సారలమ్మ జాతర
- తోగ్గూడెం, బొజ్జాయిగూడెం ప్రాంతాల్లో భక్తుల రద్దీ
- అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి రూ.లక్షల్లో ఆదాయం


పాల్వంచ మండలంలోని చంద్రాలగూడెం సమ్మక్క - సారలమ్మ ఆలయం

పాల్వంచరూరల్: జిల్లాలో రెండేళ్లకోసారి జరిగే వనదేవతల జాతర ప్రాంగణాల్లో సౌకర్యాలు కరువవుతున్నాయి. మేడారంలో సమ్మక్క–సారలమ్మ జాతరలో వనదేవతలను గతంలో కేవలం గిరిజనుల మాత్రమే పూజించేవారు. కాలక్రమంలో అన్ని వర్గాల భక్తులు ఆరాధిస్తున్నారు. ఈ క్రమంలో ఊరూరా వనదేవతల గద్దెలను నిర్మించుకుని సామూహిక పూజలను చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 400కు పైగా వనదేవతల గద్దెలు ఉన్నట్లు అంచనా. మణుగూరు మండలం తోగ్గూడెం వద్ద, ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం, గుండాల మండలం శెట్టిపల్లి గ్రామాల్లో మినీ జాతర సాగుతుంది. ఆయా ప్రాంతాలకు భక్తులు అధిక సంఖ్యలోనే వస్తుంటారు. జాతరకు 10 రోజుల ముందు నుంచే భక్తులకు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. కొందరు స్థానికంగా ఉన్న గద్దెల వద్ద అమ్మవార్లను దర్శించుకున్నాకే మేడారంలో ప్రధాన జాతరకు వెళ్లారు. సమ్మక్క–సారలమ్మ జాతర ముగిశాక గుండాల మండలం యాపలగడ్డలో పగిడిద్దరాజు జాతర జరుగుతుంది. కాగా ఈ నెల 21 నుంచి మేడారం మహాజాతర ప్రారంభం కానుంది.

సౌకర్యాలు కల్పించాలి

వనదేవతల జాతర రెండేళ్లకోసారి జరుగుతుంది. మిగతా సమయాల్లో గద్దెలకు ఎలాంటి రక్షణలేకపోవడంతో నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ప్రభుత్వం వనదేవతల గద్దెలకు భద్రత కల్పించి, అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు భక్తులకు సౌకర్యాలు కల్పిస్తే రూ. లక్షల్లో ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఆయా గ్రామాల్లోనే జాతర ప్రాంగణాల్లో తాగునీటి సౌకర్యం, స్నానాల గదులు, రహదారి, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

భక్తులు ఇబ్బంది పడుతున్నారు



వనదేవతల గద్దెలు ఊరూరా వెలిశాయి. గద్దెల వద్ద సౌకర్యాలు లేక పోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దేవాదాయ శాఖ ద్వారా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలి. సౌకర్యాలు కల్పించాలి.

– రాములు, కోడిపుంజులవాగు

వేతనాలు ఇవ్వాలి



వనదేవతలకు పలువురు గిరిజన పూజరులు పూజలు చేస్తుంటారు. జాతర జరిగినప్పుడే భక్తులకు సమర్పించే కానుకల రూపంలో ఆదాయం లభిస్తుంది. తర్వాత ఎవరూ పట్టించుకోరు. ప్రభుత్వం పూజారులకు వేతనాలు ఇవ్వాలి.

– కోర్స వెంకటేశ్వర్లు, పూజారి, చంద్రాలగూడెం

తాగునీరు అందించాలి



గ్రామగ్రామానా కొలువుదీరిన వనదేవతల గద్దెల వద్ద తాగునీటి సౌకర్యం లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం గ్రామపంచాయతీల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించాలి. స్నానాల గదులను నిర్మించాలి.

– బుచ్చమ్మ, భక్తురాలు, రేగులగూడెం

ఆదరణ తగ్గుతున్న నందిమేడారం

సౌకర్యాల కల్పనకు మొక్కుబడిగా సింగరేణి సహకారం


నంది మేడారం ప్రధాన ద్వారం

ఇల్లెందు: ఇల్లెందులోని జేకే సంజయ్‌నగర్ వద్ద సమ్మక్క–సారలమ్మ (నంది మేడారం) జాతర 1968 నుంచి సాగుతోంది. ఏడెకరాల స్థలంలో గద్దెలను ఏర్పాటు చేయగా, గతంలో జాతర సమయంలో సింగరేణి సంస్థ సౌకర్యాలు కల్పించేది. క్రమంగా సింగరేణి యాజమాన్యం మొక్కుబడిగా ఏర్పాట్లు చేస్తుండగా భక్తుల ఆదరణ తగ్గిపోతోంది. ఆ తర్వాత వెలిసిన బొజ్జాయిగూడెం గద్దెల వద్ద అంగరంగ వైభవంగా జారత సాగుతుండగా ఇక్కడి భక్తులు ఆవేదన చెందుతున్నారు. తొలుత 50 ఏళ్లపాటు బొల్లం లింగమ్మ అనే మహిళ పూజారిగా వ్యహరించగా, ఆమె తదనంతరం, కొంతకాలం ఆమె కూతురు చాగర్ల రాజేశ్వరి పూజారిగా వ్యవహరించింది. క్రమంగా గద్దెల వద్ద ఆలనాపాలనా కరువైంది. ఈ నెల 21న జారత ప్రారంభంకానుండగా, ఇప్పటివరకు ఏర్పాట్లు మొదలుకాకపోవడంతో భక్తుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది.

సహకారం అందించాలి



నంది మేడారం జాతర వైభవంగా సాగేది. సింగరేణి సహకారంతో భక్తులకు సౌకర్యాలు కల్పించేవారు. కాలక్రమేణా సింగరేణి సహకారం తగ్గగా.. పూజారులు కూడా పట్టుదలతో చేపట్టలేకపోతున్నారు. ఇకనైనా సదుపాయాలు కల్పించాలి.

– పులి సైదులు, సంజయ్‌నగర్, ఇల్లెందు

ఏర్పాట్లు చేయాలి



మేడారం జాతరకు వెళ్లలేని వారు ఇక్కడే గద్దెలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకునే వారు. కాలక్రమేణా జాతర ఇక్కడ జాతర ఆదరణ కోల్పోయింది. సింగరేణి అధికారులు స్పందించి భక్తులకు ఏర్పాట్లు చేయాలి.

– గంగరాజు, ఇందిరానగర్, ఇల్లెందు

నిధులు సక్రమంగా వినియోగించాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్


సమావేశంలో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలం: నిధులు సక్రమంగా వినియోగించాలని భద్రాచలం ఐటీడీఏ ప్రతీక్ జైన్ ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని డీఈలు, ఏఈలు, అంగన్‌వాడీ సీడీపీఓలు, ఏటీడీఓలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామయోజన పథకం కింద ఐటీడీఏ నిధులతో అంగన్‌వాడీ సెంటర్లు, జీపీఎస్ పాఠశాలలు, గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. పనులు సకాలంలో పూర్తి చేయకపోతే సంబంధిత ఏఈలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. ప్రతీ నెల మూడో శనివారం తప్పనిసరిగా ఏజెన్సీ గ్రామాల్లో ఇంజరింగ్ పనులు పురోగతిపై డీఈ, ఏఈలతో సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఏపీఓ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఎస్వో సురేష్‌బాబు, తానాజీ తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఫలాలు గిరిజనులకే చెందాలి

అటవీ ఫలాలు జీసీసీ ద్వారా గిరిజనులకే చెందాలని పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. ఐటీడీఏలో బుధవారం జీసీసీ సొసైటీ మేనేజర్లతో జీసీసీ ద్వారా సేకరిస్తున్న అటవీ ఫలాలు, ముష్టి గింజల సేకరణ, సర్వే, ఆశ్రమ పాఠశాలలకు, వసతి గృహాలకు, జీసీసీ ద్వారా సరఫరా చేసే ఫుడ్ సరఫరా తదితర అంశాలపై బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ ఆయన మాట్లాడుతూ జీసీసీ సొసైటీల్లోని వస్తువులు, టర్నోవర్, ఆదాయపు పన్ను, జీఎస్టీ వివరాలతోపాటు ముష్టి గింజలు భద్రాచలం ఏజెన్సీ ఏరియాలో ఎక్కడ పండుతాయో సర్వే నిర్వహించాలని సూచించారు. జీసీసీ ద్వారా హాస్టళ్లకు సరఫరా చేసే వస్తువులు నాణ్యంగా ఉండాలన్నారు. అశ్వారావుపేట వినాయకపురం, పాల్వంచలలో పెట్రోల్ బంక్‌లకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ వచ్చిందని, నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. సమావేశంలో ఏపీఓ డేవిడ్‌రాజ్, జీసీసీ డీఎం విజయ్‌కుమార్, డీడీ మణెమ్మ, ఏడీ భాస్కరన్, ఉమ్మడి జిల్లా జీసీసీ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి కాంటాలో దోపిడీ

వ్యాపారులకు దేహశుద్ధి చేసిన రైతులు


తూకంలో మోసం చేసిన వ్యాపారులను నిలదీస్తున్న రైతులు

చండ్రుగొండ : కాంటాలో రిమోట్ అమర్చి తూకంలో మోసం చేస్తున్న ఇద్దరు దళారి వ్యాపారులకు రైతులు దేహశుద్ధి చేసిన సంఘటన మండలంలోని బెండాలపాడులో బుధవారం జరిగింది. బెండాలపాడు గ్రామానికి చెందిన తేజావత్ సురేష్ అనే రైతు వద్ద ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యాపారులు మిర్చి కొన్నారు. 25 క్వింటాళ్ల 53 కేజీల మిర్చిని కాంటా వేసి రెండు వాహనాల్లో లోడ్ చేశారు. అయితే సురేష్‌తోపాటు మరికొందరు రైతులు అనుమానంతో మిర్చిని దామరచర్లలోని వే బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లి తూకం వేయించారు. అక్కడ 31 క్వింటాళ్ల 10 కేజీలు వచ్చింది. 5 క్వింటాళ్ల 57 కేజీలు తేడా రావడంతో ఆగ్రహించిన రైతులు మిర్చిని తమ గ్రామానికి తరలించారు. ఇద్దరు వ్యాపారులకు దేహశుద్ధి చేశారు. ఈ వ్యాపారులే బెండాలపాడు గ్రామంలోని గోగులు తిరుమలరావు, రాయల రాజేష్, బోడ శ్రీను, బాణోత్ బాలు, తేజావత్ రాంబాబు, వర్సా వీరభద్రం, చింతల సుబ్బారావు అనే రైతుల వద్ద సుమారు 100 క్వింటాళ్ల వరకు మిర్చి కొనుగోలు చేశారు. కాగా రాజీ కోసం మధ్యవర్తులు రాత్రి వరకు పంచాయితీ చేస్తున్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న ఏఎస్ఐ యూ.శ్రీనివాసరావు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. కాగా వ్యాపారులు రిమోట్ ప్యాంట్ జేబులో పెట్టుకుని కాంటాను ఆపరేట్ చేస్తున్నారని, క్వింటాకు 20 నుంచి 30 కేజీల వరకు తూకంలో మోసం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రెండోసారి తూకం వేయించకపోతే రూ. లక్ష వరకు నష్టం జరిగేదని బాధిత రైతు తేజావత్ సురేష్ ఆవేదన వ్యక్తం చేశాడు.

ఏడుగురు ఎస్సైల బదిలీలు..

కొత్తగూడెంటౌన్: జిల్లాలోని ఏడుగురు ఎస్సైలను బదిలీలు చేస్తూ బుధవారం రాత్రి పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
సోమేశ్వర్	సుజాతనగర్	కొమరారం
షేక్ జుబేదా	కొత్తగూడెం టూటౌన్	సుజాతనగర్
ఎ.రాజేందర్	వీఆర్ ఖమ్మం	కరకగూడెం ఎస్‌హెచ్‌ఓ
ఇ.రాజేష్	వీఆర్ ఖమ్మం	కొత్తగూడెం టూటౌన్ ఎస్ఐ –1
ఎం.శ్రీనివాస్	ఎస్‌హెచ్‌ఓ భద్రాచలం	ఎస్ఐ, భద్రాచలం టౌన్
ఎస్.మధుప్రసాద్	భద్రాచలం టౌన్ పీఎస్	ఎస్‌హెచ్‌ఓ భద్రాచలం ట్రాఫిక్
జి.రమణారెడ్డి	మణుగూరు	లక్ష్మీదేవిపల్లి

రసాభాసగా శివాలయ ప్రారంభోత్సవ సమావేశం


సమావేశంలో పాల్గొన్న ఆలయ పాలకవర్గసభ్యులు, గ్రామస్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మగుడి వద్ద బుధవారం నిర్వహించిన శివాలయ ప్రారంభోత్సవ సమావేశం రసాభాసగా మారింది. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) సముదాయంలో రూ.74 లక్షల వ్యయంతో శివాలయ నిర్మాణం చేపట్టారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఈ నెల 29న నిర్వహించేందుకు బుధవారం ఈఓ ఎన్.రజనీకుమారి, పాలకవర్గసభ్యులు, గ్రామస్తులతో సంయుక్త సమావేశం జరిపారు. ఈ సమావేశంలో కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల ప్రజలు కొందరు శివాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరారు. మేడారం జాతర, పదో తరగతి, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్న సమయంలో ప్రారంభోత్సవానికి భక్తులు రావాలంటే ఇబ్బందులు ఎదురవుతాయని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆలయ పనులు కూడా ఇంకా పూర్తిచేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం స్పందిస్తూ నిర్దేశించిన గడువులోగా ఆలయాన్ని ప్రారంభించాలని, లేకపోతే తాను రాజీనామాచేసి వెళ్తానని పట్టుబట్టారు. దీంతో సమావేం రసాభాసగా సాగింది. కాగా ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు శివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామని, వేడుకలకు ఏర్పాట్లపై గురువారం పాలకవర్గంతో సమావేశమై చర్చిస్తామని ఈఓ తెలిపారు.

మైనింగ్ అధికారుల మెరుపు దాడులు

11 ఇసుక లారీలకు రూ.5.50 లక్షల జరిమానా


పట్టుకున్న ఇసుక లారీల వద్ద అధికారులు

బూర్గంపాడు: ఇసుక రవాణా చేస్తున్న లారీలపై మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు మంగళవారం అర్ధరాత్రి మెరుపు దాడులు నిర్వహించారు. సారపాక-మణుగూరు క్రాస్ రోడ్డు మధ్య జాతీయ రహదారిపై వస్తున్న లారీలను ఆపి అనుమతి పత్రాలను తనిఖీ చేశారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గుండాల నుంచి సరైన పత్రాలు లేకుండా లారీలు అక్రమంగా తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించాయి. సారపాక వద్ద లారీలను తనిఖీ చేయగా సరైన పత్రాలు చూపలేదు. దీంతో మొత్తం 11 లారీలకు రూ.5.50 లక్షల జరిమానా విధించినట్లు మైనింగ్ ఏడీ జైసింగ్ తెలిపారు. ఈ తనిఖీల్లో టీఎస్ఎండీసీ అధికారులు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, నిరంజన్, బూర్గంపాడు ఎస్ఐ భిక్షం తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని జిల్లావాసి మృతి

మహబూబాబాద్‌లో ఘటన


శ్రీనివాస్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : వ్యాన్ ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం శంభునిగూడేనికి చెందిన కుంజా శ్రీనివాస్ (34), భార్య శ్రీలత, అత్త భద్రమ్మ, నాయనమ్మ పాపమ్మ, కుమారుడు సాత్విక్, కుమార్తె ఆకాంక్ష, బంధువులు మనోజ్, చరణ్, రాధతో కలిసి కేసముద్రం మండలంలోని బేరువాడలో బంధువుల ఇంట్లో జరిగిన దశదిన కర్మలకు హాజరయ్యాడు. తిరుగు ప్రయాణంలో ఓ ఆటోలో మహబూబాబాద్ వస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయం సమీపంలో మారుతి ఓమ్ని వ్యాన్ వెనుక నుంచి వచ్చి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఎడమ వైపున కూర్చున్న శ్రీనివాస్ కిందపడ్డాడు. ఇంతలోనే వెనుక నుంచి వచ్చిన వ్యాన్.. శ్రీనివాస్ పైనుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన వరంగల్ రూరల్ జిల్లా సంగెం మండలానికి చెందిన వ్యాన్ డ్రైవర్ బానోత్ సందీప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో యువకుడి హతం

- గొంతుకోసి హతమార్చిన మావోయిస్టులు

దుమ్ముగూడెం: పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు ఓ గిరిజన యువకుడిని హతమార్చిన సంఘటన సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బుధవారం చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి సుకుమా జిల్లాలోని బెజ్జి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పాలమడుగు గ్రామానికి చెందిన పాడియం జోగా (30)ను మావోయిస్టులు అపహరించారు. బుధవారం తెల్లవారుజామున గొంతు కోసి హతమార్చి, మృతదేహాన్ని పాలమడుగు గ్రామసమీపంలోని ప్రధాన రహదారిపై వదిలేశారు. ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నందనే హతమార్చామంటూ మావోయిస్టు పార్టీ కుంట ఏరియా కమిటీ పేరిట మృతదేహం వద్ద లేఖను వదిలారు. కాగా మృతుడు విద్యుత్ శాఖలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు

కాంట్రాక్టర్‌ను కాల్చి చంపిన మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు బుధవారం పట్టపగలే ఓ కాంట్రాక్టర్‌ను కాల్చి చంపారు. నారాయణపూర్ జిల్లా ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని సీమార్లు వద్ద కాంట్రాక్టర్ తాగునీటి పథకం పనులు చేయిస్తుండగా అక్కడికి వచ్చిన మావోయిస్టులు తుపాకీతో కాల్చి చంపారు.

రోడ్డు ప్రమాదంలో కారు దగ్ధం


కారు నుంచి ఎగిసిపడుతున్న మంటలు

ఇల్లెందు/ఇల్లెందురూరల్: మండలంలోని రేపల్లెవాడ గ్రామపంచాయతీ నిజాంపేట వద్ద బుధవారం ప్రమాదవశాత్తు కారు దగ్ధమైంది. చల్లసముద్రం నుంచి ఇల్లెందు వైపుగా వస్తున్న ఆర్టీసీ బస్సును వెనుకగా వచ్చిన కారు నేరుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుంచి ఒక్కసారిగా ఎగిసిపడ్డ మంటలు వాహనమంతా వ్యాపించాయి. కారులో ఉన్న వ్యక్తులు అప్రమత్తమై ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాద ఘటనపై ఆర్టీసీ బస్సు డ్రైవర్, కారు డ్రైవర్ ఇద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పినపాక: టాటా మ్యాజిక్ వాహనం, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలైన ఘటన మండల పరిధిలోని గోపాలరావుపేట గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మణుగూరు వైపు నుంచి మేడారం వెళ్తున్న టాటా మ్యాజిక్, కరకగూడెం నుంచి మణుగూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులకు, మ్యాజిక్‌లో ఉన్న ఓ బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో మణుగూరు 100 పడకల ఆస్పత్రికి తరలించారు.

ఇటుక ట్రాక్టర్ బోల్తా

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ శివారులో మణుగూరు –కొత్తగూడెం ప్రధాన రహదారిపై పాల్వంచ వైపు వెళ్తున్న ఇటుక ట్రాక్టర్ బుధవారం బోల్తా పడింది. టైరు యాక్సిల్ కింద పడి అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. ట్రాక్టర్ బోల్తా పడటంతో ట్రాఫిక్‌కు కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

పోక్సో కేసు నమోదు?

ములకలపల్లి: బాలికపట్ల అసభ్యకంగా ప్రవర్తించిన ఘటనలో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మండల పరిధిలోని పూర్వపు జగన్నాథపురం జీపీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని పట్ల అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈవిషయమై ఎస్సై రాజమౌళిని వివరణ కోరగా.. విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా...

నా విజయంలో ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ పాత్ర కీలకం

జేఈఈ మెయిన్స్ టాపర్ రిషి శేఖర్ శుక్లా



సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్– 2024లో 300కు గాను 300 మార్కులతో 100 పర్సంటైల్ సాధించిన రిషి శేఖర్ శుక్లా తన విజయంలో ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ కీలకపాత్ర పోషించిందన్నాడు. ఆకాశ్ నేషనల్ టాలెంట్ హంట్ ఎగ్జామ్ ద్వారా ఆ ఇన్‌స్టిట్యూట్ గురించి తెలుసుకున్నానని, క్లాస్‌రూమ్ వాతావరణం విద్యార్థికి అనుకూలంగా ఉంటుందని చెప్పాడు. రిషి తన ప్రిపరేషన్ గురించి మాట్లాడుతూ 'నా ప్రిపరేషన్‌లో ముఖ్యంగా 4 స్టెప్స్ ఫాలో అయ్యాను. మొదటగా క్లాస్‌లో కాన్సెప్ట్‌ను శ్రద్ధగా వినడంపై దృష్టి సారించా. తద్వారా ప్రాబ్లమ్స్‌ను తేలిగ్గా సాధన చేసేవాడిని. ఏమైనా సందేహాలుంటే లెక్చరర్లను అడిగి తెలుసుకునేవాడిని. చివరగా ఎక్కడ తప్పు చేస్తున్నానో తెలుసుకుని సరిదిద్దుకునేవాడిని'అని వివరించాడు. తన ప్రిపరేషన్‌లో ఆకాశ్ లెక్చరర్లు తనకు అందించిన సహకారం వెలకట్టలేనిదని చెప్పారు. అలాగే తన తల్లిదండ్రులు తన విజయంలో కీలకంగా వ్యవహరించారన్నారు. స్థిరంగా కష్ట పడి చదివే గుణమే జేఈఈలో విజయాన్ని అందిస్తుందని రిషి పేర్కొన్నాడు.

ఆయిల్‌పామ్‌పై ఏపీ ప్రభుత్వం, హెచ్‌యూఎల్ చర్చలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆయిల్‌పామ్ ఉత్పత్తిని పెంపొందించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హిందూస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్)తో చర్చలు జరిపింది. ఈమేరకు హెచ్‌యూఎల్ లీగల్ కార్పొరేట్ వ్యవహారాలు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేవ్ బాజ్ పేయి, హెచ్‌యూఎల్ సప్లై చైన్ ఎగ్జిక్యూటివ్ యోగేశ్ మిశ్రా నేతృత్వంలో కంపెనీ ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం.. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఆహార ఉత్పత్తి శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నేరుగా రైతులకు, పరిశ్రమలకు ప్రయోజనం చేకూర్చేలా పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. దీని ద్వారా దిగుమతులను తగ్గించుకోవచ్చన్నారు. ఏపీలో ఆయిల్‌పామ్‌ను 30 వేల హెక్టార్లలో సాగుకు 15 వేల మంది రైతుల భాగస్వామ్యం అవసరమని హెచ్‌యూఎల్ ప్రతిపాదించింది. నర్సరీల పెంపకం, రాష్ట్రంలో ఆయిల్ పామ్ మిల్ ఏర్పాటు ద్వారా రూ.300 కోట్లకు పైగా పెట్టుబడులు రాబట్టొచ్చని తెలిపింది. ఆయిల్‌పామ్ మిల్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి ఉద్యోగాలు వస్తాయని పేర్కొంది. దేవ్ బాజ్ పేయి మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

బాబు ముడుపులకు రోహిత్ వేషం!

సీఎం హోదాలో 'సినిమా'తో వైట్.. బ్లాక్‌గా మళ్లింపు

సినిమా నిర్మాణం పేరుతో నిధుల ప్రవాహం

- రూ.5–6 కోట్ల ఖర్చుతో తూతూమంత్రంగా సినిమాలు
- రూ.30–40 కోట్లు ఖర్చయినట్లు తప్పుడు లెక్కలు
- ఇలా ఆ ఐదేళ్లలో ఫ్లాపు హీరోకు 17 సినిమాల ఛాన్స్‌లు
- ఆ తర్వాత ఇప్పటి దాకా ఒక్క సినిమా కూడా లేని వైనం
- ఖర్చులు పోగా మిగిలిన రూ.300 కోట్లు బాబు ఇంటికి
- టాక్ ఆఫ్ ది సినీ ఇండస్ట్రీగా మారిన వ్యవహారం



బహుశా.. ఇలాంటి ఆలోచన ఎవరికీ వచ్చి ఉండదు. కానీ చంద్రబాబు నాయుడు ఇక్కడ!! ఆయన 'స్కిల్' మామూలుదా!! ముడుపులు పుచ్చుకోవడంలో, తీసుకున్న వాటిని తెలివిగా దారి మళ్లించి తన జేబులోకి తెచ్చుకోవడంలో ఆయన 'స్కిల్స్'ను బయటపెట్టే 'సినిమా' కథ తాజాగా బయటపడింది. ఈ కథకు హీరో ఒక్కడే. బాబు సోదరుడి కొడుకు నారా రోహిత్. నిర్మాతలుగా బయటకు వేరేవారు కనిపించినా... సహ నిర్మాతలుగా, ఫైనాన్షియర్లుగా వ్యవహరించింది మాత్రం బాబు హయాంలో వివిధ ప్రాజెక్టుల పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు. తీసిందేమో ఫ్లాపు సినిమాలు. భారీగా నష్టం వచ్చిందంటూ ప్రకటనలు. చంద్రబాబుకు మాత్రం లాభాలే లాభాలు!. అదెలాగని ఆశ్చర్యపోతున్నారా? లంచాలు దిగమింగడంలో బాబు మాస్టర్‌మైండ్‌ను కళ్లకు కట్టినట్లు చూపించే టాలీవుడ్ సినిమాల కథ ఇదిగో...

సాక్షి, హైదరాబాద్: అరె! ఒక్కటంటే ఒక్క సినిమా కూడా రూపాయి లాభం తెచ్చిన పాపాన పోలేదు. ఒక్కటంటే ఒక్కటి కూడా కనీసం బ్రేక్ ఈవెన్ (లాభనష్టాలు లేని స్థితి) సాధించింది లేదు. ప్రతి సినిమాకూ పెట్టిన పెట్టుబడిలో కనీసం 80 శాతం తిరిగి రాలేదని నిర్మాతలే చెబుతున్నారు. అలాగని అవేవీ చిన్న సినిమాలు కావు. అన్నీ 30–40 కోట్ల రేంజి బడ్జెట్ సినిమాలేనట? మరి ఇలా నష్టాలొచ్చినా సరే వదలకుండా అదే హీరోను పెట్టి వరసగా ఏడాదిలో ఆరేడు సినిమాలు తీసేశారంటే ఏమనుకోవాలి? బ్లాక్ మనీ దండిగా ఉన్నవాళ్లు కూడా నేరుగా డబ్బును కాల్చేయటం ఎందుకున్న ఉద్దేశంతో ఇలాంటి సినిమాలు తీయరు. కానీ నారా రోహిత్‌తో మాత్రం కొందరు నిర్మాతలు పదేపదే ఫ్లాప్ సినిమాలు తీశారు. ఫ్లాపు సినిమాలిచ్చిన దర్శకులతోనే మళ్లీ మళ్లీ ఫ్లాపు సినిమాలు తీశారు. ఒకసారి దర్శకత్వం వహించి ఫ్లాపు సినిమా ఇచ్చిన వ్యక్తి అదే హీరోతో మరో సినిమాకు నిర్మాతగా కూడా మారాడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

బాబు హయాంలో 17 సినిమాలు

- ప్రతినిధి (2014)
- రౌడీ ఫెలో, అసుర, తుంటరి, సావిత్రి (2015)
- రాజా చెయ్యి వేస్తే, జో అచ్యుతానంద, శంకర, అప్పట్లో ఒకడుండేవాడు (2016)
- శమంతకమణి, ఒక్కడు మిగిలాడు, కథలో రాజకుమారి, బాలకృష్ణుడు, మెంటల్ మదిలో (2017)
- నీది నాది ఒకే కథ, ఆటగాళ్ళు, వీరభోగ వసంతరాయలు (2018)

ఇదీ... 2014లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక సినీతారగా మారిపోయిన 'నారా రోహిత్' కథ. విచిత్రమేంటంటే రోహిత్‌కు 2014కు ముందు పెద్దగా సినిమాలు లేవు. 2019లో చంద్రబాబు అధికారంలో నుంచి దిగిపోయాక కూడా సినిమాలు లేవు. కానీ 2014–1019 మధ్య మాత్రం ఏకంగా 17 సినిమాలు వచ్చాయి. అంటే... బాబు అధికారానికీ, నారా రోహిత్ సినిమాలకూ ఏదో సంబంధం ఉందనేగా అర్థం. అది ఏ సంబంధమంటే... ముడుపుల సంబంధం. బ్లాక్ మనీ సంబంధం బాబు ప్రభుత్వంలో కాంట్రాక్టులు పొందిన వ్యక్తులు, సంస్థలు ఆయనకు నేరుగా ముడుపులివ్వటానికి ఇబ్బంది పడ్డారు. జీఎస్టీ వచ్చాక కాంట్రాక్టర్లకు మొత్తం బిల్లులు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకే చెల్లించాల్సి వచ్చింది. దీంతో వారు ఆ డబ్బుల్లో నుంచి ఎవరికి ఎంత చెల్లించినా ఐటీకి లెక్కలు చెప్పాల్సి వచ్చేంది. మరి బాబుకు ఇవ్వాల్సిన వాటా ఇవ్వడమెలా? దీనికోసం మాస్టర్ మైండ్ చంద్రబాబు ఒక మార్గం కనిపెట్టాడు. తన తమ్ముడు రామ్మూర్తి నాయుడి కొడుకు నారా రోహిత్‌ను హీరోగా పెట్టి సినిమాలు తీయాల్సిందిగా తెలిసిన నిర్మాతలు, దర్శకులకు పురమాయించాడు. దానికి కావాల్సిన డబ్బులు మాత్రం ఈ కాంట్రాక్టర్లు, తన ప్రభుత్వంలో లబ్ధి పొందిన వాళ్లు సహ నిర్మాతల రూపంలోనో, ఫైనాన్సియర్లగానో చెల్లిస్తారు. ఓ 5 కోట్లతో పూర్తయ్యే సినిమాకు ఏకంగా రూ.40 కోట్ల బడ్జెట్ కేటాయించటమే కాక... అంతా ఖర్చుపెట్టినట్లు చూపిస్తారు. వాస్తవంగా రూ.5 కోట్లు ఖర్చయితే.... మిగతా రూ.35 కోట్లు నేరుగా బాబు బంగళాకు చేరిపోతాయి. ఇక ఈ సినిమా ఎలాగూ ఐదారు కోట్ల కన్నా ఎక్కువ వసూలు చేయదు. దీంతో తాము భారీగా నష్టపోయామని నిర్మాతలు ప్రకటిస్తారు.

ఇదీ... రోహిత్ ఫ్లాపుల కథ

నారా రోహిత్ యావరేజ్ నటుడు. 2009 నుంచి 2014 వరకు.. అంటే చంద్రబాబు సీఎం కుర్చీలో లేని ఆ ఐదేళ్లలో అతను నటించిన సినిమాలు నాలుగే,. బాణం (2009), సోలో (2011), సారొచ్చారు (2012), ఒక్కడినే (2013). మొదటి రెండూ యావరేజ్ కాగా, మిగిలిన రెండూ డిజాస్టర్లు. దాంతో రోహిత్‌కి సినిమా అవకాశాలు తగ్గిపోయాయి. అయితే ఏడాది తర్వాత చంద్రబాబు సీఎం కాగానే రోహిత్ ముఖ 'చిత్రం' మారిపోయింది. హిట్ హీరోలకు సైతం సాధ్యం కాని స్థాయిలో వరుస పెట్టి సినీ అవకాశాలొచ్చాయి. 2019లో బాబు దిగిపోయేనాటికి ఏకంగా 17 సినిమాలు. అన్నీ ఫ్లాపులు, డిజాస్టర్లే. నిజానికి వీటిలో చాలా సినిమాలు రిలీజ్ అయిన సంగతి కూడా ప్రేక్షకులకు తెలీదు. మళ్లీ 2019లో చంద్రబాబు దిగిపోయినప్పటి నుంచి ఈ రోజు వరకు ఒక్కటంటే ఒక్క సినిమా కూడా రోహిత్ చేయలేదు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఇలా, అలా తిప్పి... కొడుకు చేతికి డబ్బులు

ఒక ప్రాజెక్టు నిర్మించిన కాంట్రాక్టరుకు ప్రభుత్వం రూ.500 కోట్లు బ్యాంకు ద్వారా చెల్లింపులు చేసిందనుకోండి. ఒప్పందం ప్రకారం దీన్లో 50 శాతం అంటే రూ.250 కోట్లు ముడుపులు బాబుకివ్వాలి. నగదు రూపంలో ఇవ్వటం సాధ్యం కాదు కదా? మరి ఎలా? దీంతో కొన్ని సినిమా నిర్మాణ సంస్థలను పుట్టించారు. ఆ సంస్థల పేరిట అనేక బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేశారు. ఒక్కో ఖాతాకు చిన్న చిన్న మొత్తాల్లో ఈ రూ.250 కోట్లు తరలించారు. ఇక ఆయా ఖాతాల నుంచి డబ్బు డ్రా చేయటం కోసం సినిమా నిర్మాణం అనే పేరు పెట్టారు. రూ.2–3 కోట్లలో చుట్టేసిన చిన్న చిన్న సినిమాలకు కూడా రూ.30–40 కోట్లు అయిందని దొంగ లెక్కలు చూపించారు. సినిమాలో రోజు వారీ ఖర్చులు కింద / ప్రొడక్షన్ ఖర్చుల కింద వాటికి దొంగ బిల్లులు పెట్టారు. ప్రతి సినిమాకు రూ.20 కోట్లు– రూ.30 కోట్లు నష్టం వచ్చిందని రికార్డులు తయారు చేశారు. అలా ఎక్కడా టాక్స్ చెల్లించే సమస్య రాకుండా చూసుకున్నారు. ఇలా మొత్తం డబ్బును బ్లాక్‌గా మార్చి, అటుతిప్పి ఇటుతిప్పి ఆఖరుకు చంద్రబాబు కుటుంబ సభ్యుల చేతికి భద్రంగా చేర్చారు. ఇలా గుంటూరు జిల్లాకు చెందిన ఒక కాంట్రాక్టర్ ఒక్కడి దగ్గరే రూ.250 కోట్లు చిన్న చిన్న మొత్తాల్లో ట్రాన్స్‌ఫర్ చేయించారని ఆయనే ఇటీవల వాపోయారు. ఇలా నారా రోహిత్‌ను వాడేసుకుని 17 సినిమాలు హడావుడిగా చుట్టేసి.. చాలా మంది కాంట్రాక్టర్ల నుంచి ముడుపుల డబ్బును నారా లోకేష్‌కు అందించారు. కాంట్రాక్టర్‌లే కాకుండా కొన్ని వ్యాపార సంస్థల నుంచి కూడా ఇదే తరహాలో డబ్బులు దండుకున్నారని తెలిసింది.

ఈ ప్రశ్నలకు బదులేదీ?

- బడా స్టార్స్, క్రేజీ హీరోలకు తప్ప మరే హీరోదైనా ఒక సినిమా డిజాస్టర్ అయింది అంటే రెండో సినిమా అవకాశం కనాకష్టం అలాంటిది వరుసగా ఇన్ని సినిమాల్లో నారా రోహిత్ ఎలా చేయగలిగాడు?
- ఆయన సినిమాల బిజినెస్, కలెక్షన్ల ప్రకారం .. ప్రతి సినిమా రూ.20, 30 కోట్లకు పైగా భారీ నష్టాలు మూటగట్టుకుంది. అయినా కూడా నిర్మాతలు వరుస కట్టి అదే హీరోతో పదే పదే సినిమాలు ఎందుకు తీశారు?
- అతి కొద్ది మంది తప్ప నారా రోహిత్‌తో సినిమాలు తీసిన వారిలో ఎవరూ అంతకు ముందు భారీ చిత్రాలు తీసిన చరిత్ర ఉన్న నిర్మాతలు కాకపోవడం గమనార్హం. అలాంటప్పుడు వారు ఈయనతోనే మళ్లీ భారీ చిత్రాలు ఎందుకు తీశారు?
- నారా రోహిత్ సినిమా నిర్మాతల్లో పలువురికి తెలుగుదేశం పార్టీతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు ఉండడం వెనుక మతలబు ఏమిటి?

దొంగ లెక్కలతో బురిడీ

ఆయా సినిమాల అంచనా వ్యయం, లాభ నష్టాలు, వాస్తవ బడ్జెట్ వంటివన్నీ పరిగణనలోకి తీసుకుంటే.. హీరో రెమ్యునరేషన్‌తో సహా నారా రోహిత్ సినిమా బడ్జెట్ ప్రొడక్షన్ స్టార్ కాంబినేషన్‌ను బట్టి రూ.5–10 కోట్లు లోపు మాత్రమే. అయితే రోహిత్‌తో సినిమాలు తీసిన నిర్మాతలు మాత్రం వీటి బడ్జెట్ రూ.30 నుంచి 40, 45 కోట్ల దాకా కూడా చెబుతూవచ్చారు. అదే విధంగా వాళ్ల బంధు గణంతోనే డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ అవతారాలు ఎత్తించి థియేట్రికల్ రైట్స్‌ను రూ.30 కోట్లు నుంచి రూ.40 కోట్లకు కొనిపించినట్లు చూపారు. అంటే ఆ సినిమాలు తీసేవాడూ, వాటిని కొనేవాడూ ఇద్దరూ ఒకరేనని తెలుస్తోంది. సినిమా ఆడలేదు కాబట్టి.. తమకు ఇంత నష్టం వచ్చిందని ప్రభుత్వానికి ఈ ముఠా దొంగ లెక్కలు చూపించింది. ఇలా రోహిత్ సినిమాల ద్వారా లంచాల రూపంలో వచ్చిన బ్లాక్ మనీ సుమారు రూ.300 నుంచి 400 కోట్ల వరకు దండుకున్నారని అంచనా.

ఏపీపీఎస్సీ.. మరో ఐదు

- వారంలో వెలువడనున్న నోటిఫికేషన్లు
- అటవీశాఖలో 861 పోస్టుల భర్తీకి సిద్ధం
- విద్యుత్, మత్స్య, జైళ్ల శాఖలు, గణాంకాల విభాగంలో ఖాళీల భర్తీ



సాక్షి, అమరావతి: నిరుద్యోగ యువతకు శుభవార్త! ఇప్పటికే గ్రూప్– 1, 2 పోస్టులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చిన ఏపీపీఎస్సీ త్వరలో అటవీ శాఖలో పలు ఉద్యోగాలను భర్తీ చేయనుంది. ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వడంతో ఈమేరకు వివిధ కేటగిరీల్లో 861 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ల జారీకి చర్యలు చేపట్టింది. ఒకవైపు గ్రూప్–2 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు చేస్తూనే మరోవైపు అటవీశాఖ ఉద్యోగాల భర్తీకి సన్నద్ధమైంది. మరో వారం రోజుల్లో ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్లు వెలువడనున్నట్లు సమాచారం. వీటిలో 37 ఫారెస్టు రేంజ్ ఆఫీసర్లు, 70 ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు, 175 ఫారెస్టు బీట్ ఆఫీసర్లు, 375 అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు, 10 తానా దార్లు, 12 టెక్నికల్ అసిస్టెంట్లు, మరో 10 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కలిపి 689 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి లభించింది. ఇవి కాకుండా ఎఫ్ఎస్ఓ, బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ లాంటి మరో 172 క్యారీ ఫార్వర్డ్ పోస్టులతో కలిపి మొత్తం 861 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌తో పాటు పరీక్షల షెడ్యూల్‌ను కమిషన్ త్వరలో ప్రకటించనుంది. ఇవే కాకుండా విద్యుత్తు శాఖలో అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్, మత్స్యశాఖలో ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, జైళ్ల శాఖలో జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్టు పోస్టు, ఏపీ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టికల్ విభాగంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్లు వెలువడనున్నాయి.

రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటుకు సీఎం శంకుస్థాపన



ఖైరతాబాద్ (హైదరాబాద్): సచివాలయం ఎదురుగా భారతరత్న స్వర్గీయ రాజీవ్‌గాంధీ విగ్రహ శంకుస్థాపనకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హన్మంతరావు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

ఖమ్మం మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

ఖమ్మంవ్యవసాయం: దేశ వ్యాప్త కార్మికుల సమ్మె, వారాంతపు సెలవుల కారణంగా శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సమ్మె, శని, ఆదివారాలు వారాంతపు సెలవుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 19న సోమవారం నుంచి పంట కొనుగోళ్లు ఉంటాయని కార్యదర్శి తెలిపారు.

రీజియన్‌కు 32 మంది గురుకుల టీచర్లు



ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు బుధవారం హైదరాబాద్‌లో నియామకపత్రాలు అందుకున్నారు. ఇందులో 32మందిని ఖమ్మం రీజియన్‌కు కేటాయించారు. వీరిలో ఖమ్మం జిల్లాలోని గురుకులాలకు 15 మందిని కేటాయించగా, లైబ్రరియన్ సైన్స్, సోషల్ స్టడీస్, పీడీ ఒక్కొక్కరితో పాటు ఇంగ్లిష్ అధ్యాపకులు ఆరుగురు, గణితం నలుగురు, తెలుగు అధ్యాపకులు ఇద్దరు ఉన్నారు. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 11 మందిని కేటాయించగా, ఇంగ్లిష్ ఇద్దరు, గణితం ఐదుగురు, సోషల్, తెలుగు, లైబ్రేరియన్ సైన్స్, పీడీ ఒక్కొక్కరు ఉన్నారు. ఇక మహబూబాబాద్ జిల్లాకు ఆరుగురిని కేటాయించగా వీరిలో గణితం, సోషల్ ఒక్కొక్కరు, తెలుగు అధ్యాపకులతో పాటు పీడీలు ఇద్దరు చొప్పున ఉన్నారు.

సోలార్ ప్లాంట్‌లో ట్రయల్ రన్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలోని 3 ఇంక్‌లైన్‌లో ఏర్పాటు చేసిన 10.5 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను త్వరలో ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి అథారిటీ అధికారులు ప్లాంట్‌ను సందర్శించారు. ఇక్కడ 10.5 మెగావాట్ల ప్లాంట్‌కు గాను ప్రస్తుతం 8 మెగావాట్ల యూనిట్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో ఈమేరకు విద్యుత్ ఉత్పత్తి మొదలుకానుండగా అధికారులు పరిశీలించి ట్రయల్ రన్ నిర్వహించారు. యూనిట్‌లో కీలకమైన పలకాల బిగింపు పూర్తయినందున యూనిట్‌ను త్వరలోనే ప్రారంభించి గ్రిడ్‌ను అనుసంధానం చేయనున్నట్లు సమాచారం.

భక్తుల చెంతకే 'బంగారం'

- ఆర్టీసీ కార్గో ద్వారా మేడారం ప్రసాదం
- ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే ఇంటి వద్దకు చేరవేత
- బుకింగ్‌కు 25వ తేదీ వరకు అవకాశం





ఖమ్మంమయూరిసెంటర్: కార్గో సేవల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న టీఎస్ ఆర్టీసీ అధికారులు మేడారం జాతరకు వెళ్లలేని భక్తులకు ఇంటి వద్దే ప్రసాదం(బంగారం) అందజేయాలని నిర్ణయించారు. గతంలో భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ తలంబ్రాలను విజయవంతంగా చేరవేయగా.. భక్తులకు మరింత దగ్గరయ్యేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. మేడారం సమ్మక్క – సారలమ్మ జాతర సందర్భంగా బంగారం(బెల్లం)తో పాటు పసుపు, కుంకుమను భక్తులకు అందించనున్నారు. గత జాతర సందర్భంగా భక్తుల నుంచి అమ్మవారికి సమర్పించే బంగారం, చీర తీసుకెళ్లి మేడారం గద్దెల వద్ద పెట్టి తిరిగి తీసుకొచ్చే విధానం అమలుచేశారు. అయితే, రద్దీ కారణంగా ఇది సత్ఫలితాలను ఇవ్వకపోవడంతో ఈసారి జాతరలో గద్దెల వద్ద భక్తులు సమర్పించే బంగారాన్ని దేవాదాయ శాఖ ద్వారా సేకరించి భక్తులకు అందించేందుకు ఆ శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది.

మొదలైన బుకింగ్

రాష్ట్రంలో ఆర్టీసీకి చెందిన అన్ని కార్గో(లాజిస్టిక్స్) కౌంటర్లలో ప్రసాదం కోసం బుధవారం బుకింగ్ మొదలుకాగా, ఈనెల 25వ తేదీ వరకు స్వీకరిస్తారు. సమ్మక్క–సారలమ్మ అమ్మవార్ల బంగారం, పసుపు, కుంకుమ కావాలనుకునే భక్తులు ఆర్టీసీ కార్గో(లాజిస్టిక్స్) కౌంటర్లలతో పాటు బస్‌డిపోల పరిధిలో విధులు నిర్వర్తించే మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లను నేరుగా సంప్రదించవచ్చు. ఒకవేళ కౌంటర్లకు వెళ్లలేని వారైతే పేటీఎం ఇన్‌సైడర్ పోర్టల్ లేదా ఆర్టీసీ యాప్‌లోనూ బుక్ చేసుకోవచ్చు. ఇందుకోసం రూ.299 చెల్లించాల్సి ఉంటుంది. ఈనెల 25వ తేదీ వరకు భక్తులు ప్రసాదం కోసం బుక్ చేసుకునే వీలుండగా... దేవాదాయ శాఖ ద్వారా బంగారం (200 గ్రాముల నుంచి 250 గ్రాములు), పసుపు, కుంకుమ సేకరించి భక్తులకు చేరవేస్తారు.

ప్రసాదం బుకింగ్ వివరాల కోసం సంప్రదించాల్సిన నంబర్లు

పేరు	హోదా	నంబర్
బి.వీరభద్రం	ఖమ్మం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్	91542 98583
కె.హరివర్మ	రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్	91542 98582
పేటీఎం	వరంగల్, ఖమ్మం రీజియన్	81254 58546
	హైదరాబాద్	040-69440000

తొలుత మేడారం నుంచి ప్రసాదం ప్యాకెట్లు హనుమకొండకు చేరుకోనుండగా.. అక్కడి నుంచి డిపోల వారీగా పంపించి భక్తులకు అందిస్తారు.

ఇంటి వద్దకే..

ఆర్టీసీ కార్గో సేవలకు రాష్ట్ర వ్యాప్తంగా ఆదరణ లభించడంతో భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వార్ల కల్యాణ తలంబ్రాలను గత ఏడాది 1.50 లక్షల కుటుంబాలకు అందజేసి రికార్డ్ సృష్టించారు. అదే స్థాయిలో గిరిజన కుంభమేళాగా పేరున్న మేడారం సమ్మక్క – సారలమ్మ జాతర సందర్భంగా అమ్మవార్ల ప్రసాదాన్ని లక్ష కుటుంబాలకు చేరవేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. భక్తులు బంగారం బుకింగ్ కోసం 25వ తేదీ వరకు అవకాశం ఉండగా.. ఆ తర్వాత గణాంకాల ప్రకారం దేవాదాయ శాఖ నుంచి సేకరిస్తారు. అనంతరం ప్రసాదాలను హనుమకొండకు చేర్చి అక్కడి నుంచి డిపోలకు, ఆపై భక్తుల ఇళ్ల చిరునామాకు చేరుస్తారు. ఇందుకోసం స్థానికంగా కొందరు రవాణాదారులతో ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. కాగా, బస్‌డిపోల పరిధిలో విధులు నిర్వర్తించే మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లకు బాధ్యతలు అప్పగించగా.. బుకింగ్ వివరాల కోసం వారిని సంప్రదించాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.

ఆన్‌లైన్‌లో ప్రసాదం బుకింగ్



మేడారం అమ్మవార్ల బంగారం (ప్రసాదం) కోసం భక్తులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. ప్రసాదం కావాలనుకునే వారు మా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌ల ద్వారా వివరాలు తెలుసుకోవాలి. రాష్ట్ర వ్యాప్తంగా మేడారం ప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు చేశాం. ఈనెల 25 వరకు ప్రసాదం కోసం బుకింగ్‌కు అవకాశం ఉండగా.. 26వ తేదీ నుండి పంపిణీ ప్రారంభిస్తాం.

– ఎ.గిరిమహేష్, డిప్యూటీ సీటీఎం, టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్

సమస్యల పరిష్కారానికి 'ఫోరం' కృషి

విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ తిరుమల్‌రావు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న చైర్మన్ తిరుమల్‌రావు

రఘునాథపాలెం: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకు విద్యుత్ వినియోగదారుల ఫోరం ద్వారా కృషి చేస్తున్నామని చైర్మన్ కె.తిరుమల్‌రావు తెలిపారు. రఘునాథపాలెం మండలం మంచుకొండ సబ్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్పీడీసీఎల్ పరిధి పది జిల్లాల్లో ఇప్పటివరకు 489 సమస్యలను పరిష్కరించామని పేర్కొన్నారు. వినియోగదారులకు ఇబ్బంది కలిగించిన ఉద్యోగులు, సిబ్బంది ద్వారా రూ.1.53 లక్షల జరిమానా వసూలు చేసినట్లు తెలిపారు. కోర్టు కేసులు, విద్యుత్ చౌర్యం మినహా మిగిలిన అన్ని సమస్యలను ఫోరం ఆధ్వర్యాన ఎలాంటి రుసుము లేకుండా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కాగా, వినియోగదారులు పోస్ట్, వాట్సప్, మెయిల్ ద్వారా లేక 94408 11299, 83339 23840, 94913 07004 నంబర్ల ద్వారా సమస్యలను తమ దృష్టికి తీసుకురావొచ్చని తెలిపారు. ఈసదస్సులో ఫోరం సభ్యులు చరణ్ దాస్, ఎస్.నరేందర్, డీఈలు రామారావు, బాబురావు, ఏడీఈ సంజయ్‌కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

తలసేమియాను తరిమికొడదాం..

'సంకల్ప' ర్యాలీలో ఏసీపీ సుశీల్‌సింగ్, ఐఎంఏ అధ్యక్షుడు నారాయణరావు




జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్



ర్యాలీలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థులు

ఖమ్మంవైద్యవిభాగం: సమాజంలో ప్రమాదకరంగా మారుతున్న జన్యుపరమైన వ్యాధి తలసేమియాను అరికట్టేందుకు అంతా కృషి చేయాలని.. ఈ విషయమై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్‌చౌహాన్, ఖమ్మం ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కంభంపాటి నారాయణరావు సూచించారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన బుధవారం ఖమ్మంలోని పెవిలియన్ మైదానం నుండి మయూరిసెంటర్, వైరా రోడ్డు, జెడ్పీ సెంటర్ల మీదుగా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన సుశీల్‌సింగ్, నారాయణరావు మాట్లాడుతూ జిల్లాలో తలసేమియా చిన్నారుల కోసం సంకల్ప సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సంస్థతో పాటు దాతలు అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. అయితే, తలసేమియా వ్యాధిని నిర్మూలించేలా వైద్యరంగంలో వస్తున్న సాంకేతికను వినియోగించుకుని బాధిత పిల్లలు జన్మించకుండా చూసుకోవాలని తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ మాట్లాడగా, ర్యాలీలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు, ఏంజిల్స్ కళాశాల, పులిపాటి నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్ ఆర్ఐ ఎం.సురేష్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ రావూరి మాధవరావు, డీఎంశ్రీనివాస్, వైద్యులు డి.నారాయణమూర్తి, జితేందర్, లక్ష్మీదీపతో పాటు శ్రీనివాస్, బోస్‌యాదవ్, అనురాధ, పి.పావని, పి.రవి, ఉదయ్‌భాస్కర్, అనిత, వంశీకిరీటి తదితరులు పాల్గొన్నారు.

ఒక వైపే పూత !



ఓ మామిడి చెట్టుకు ఓ వైపంతా పూత విరబూయగా, మరోవైపు అసలు పూతే రాలేదు. అశ్వారావుపేట మండలం జమ్మిగూడెం వెళ్లే మార్గంలోని ఓ మామిడి తోటలో ఉన్న చెట్టు ఇలా కనిపించింది. సగం పూతతో, మిగతా సగం పూత లేకుండా ఉన్న ఈ చెట్టును స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. – అశ్వారావుపేటరూరల్